క్లుప్తంగా

గ్రామ, వార్డు సచివాలయ శాఖను రద్దు చేయాలి

కడప కార్పొరేషన్‌: గ్రామ, వార్డు సచివాలయ శాఖను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్‌ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్‌ జిల్లా అధ్యక్షుడు ఇ.రామయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు టి.కిరణ్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి మునీంద్రా రెడ్డి, కడప నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వరప్రసాద్‌, హేమసుందర్‌ రాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సచివాలయాల శాఖ కేవలం ఉద్యోగులను కట్టు బానిసలుగా, రోజు కూలీల మాదిరిగా వెట్టి చాకిరీ చేయిస్తోందన్నారు. వారి ప్రయోజనాలు కాపాడడంలో అది పూర్తిగా విఫలమైందని వాపోయారు. అవసరం లేని శాఖతో ప్రభుత్వంపై ప్రతి ఏడాది నిర్వహణ ఖర్చు పెరిగిపోతోందన్నారు. జిల్లాలు, రాష్ట్ర స్థాయిలో ఒప్పంద ఉద్యోగులు ఈ శాఖలో పనిచేయడం వృథా అన్నారు. కొందరు సీనియర్‌ ఉద్యోగులు సచివాలయ ఉద్యోగులను చిన్నచూపు చూస్తున్నారన్నారు. సెలవులు, ఆది వారాలలో సైతం వారితో పనిచేయించుకుంటూ వేధిస్తున్నారన్నారు.

ప్రాణాలు కాపాడాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ నాగరాజు

కడప సెవెన్‌రోడ్స్‌/కోటిరెడ్డిసర్కిల్‌: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్‌ నాగరాజు పిలుపునిచ్చారు. ప్రజాపిత బ్రహ్మ కుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం పూర్వ సంచాలక రాజయోగిని దాది ప్రకాశమణి వర్ధంతి స్థానిక ఓం శాంతిభవన్‌లో ఆదివారం నిర్వహించారు. సీనియర్‌ రాజయోగిని బీకే.గీతాదీదీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. నందిని, బీకే.శిరీష, రాధిక, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో సంపూర్ణ మద్దతు

కడప ఎడ్యుకేషన్‌: 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు, కేంద్ర ప్రభుత్వ మెమో నం 57 ద్వారా పాత పెన్షన్‌ విధానం అమలు చేయాలని 25న విజయవాడలోని ధర్నాచౌక్‌లో జరిగే ధర్నాకు కడప జిల్లా ఫ్యాప్టో సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందనిజిల్లా ఫ్యాక్టరీ చైర్మన్‌ ఇలియాస్‌బాషా, సెక్రటరీ జనరల్‌ ఆర్‌.అబ్దుల్లా ఓ ప్రకటనలోతెలియజేశారు. ఈ ధర్నాలో ఉపాధ్యాయ మిత్రులంతా పాల్గొనాలన్నారు.

గంటికోటలో పర్యాటక దినోత్సవం జరపాలి

కడప సెవెన్‌రోడ్స్‌: గండికోటలో సెప్టెంబరు 2న రాష్ట్రస్థాయి పర్యాటక దినోత్సవం నిర్వహించాలని తాళపత్ర గ్రంథలిపి నిపుణులు నాగదాసరి మునికుమార్‌ కోరారు. ఏపీ ప్రభుత్వం ఇందుకోసం ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు, పర్యాటక మంత్రి కందుల దుర్గేష్‌, ఆ శాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరి, సీఈఓలకు డిజిటల్‌ వినతి పత్రాలు సమర్పించినట్లు తెలిపారు.

మైనార్టీలకు అన్యాయం

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: బీజేపీ పాలనతో మైనార్టీలకు అన్యాయం జరిగిందని ఏపీసీసీ కో–ఆర్డినేటర్‌ సత్తార్‌ అన్నారు. నగరంలోని వైఎస్సార్‌ మెమోరియల్‌ ప్రెస్‌ క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలకు నష్టం కలిగించే బిల్లులు ఉభయ సభల్లో ప్రవేశపెడితే అన్ని కూటమి ఎంపీలు మద్దతు ఇవ్వడం సరికాదన్నారు. వక్ఫ్‌ సవరణ బిల్లు ఉభయ సభల్లో ప్రవేశపెట్టినపుడు వైఎస్సార్‌ సీపీ ఎంపీలు ఆ బిల్లుకు మద్దతుగా ఓటు వేయలేదన్నారు. ఈ సమావేశంలో నాసిర్‌ఖాన్‌, ఆసిఫ్‌ ఖాన్‌ నాసిర్‌ హుస్సేన్‌ ,అక్రమ్‌, చాంద్‌ భాషా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్‌ జగన్‌ పరామర్శ

కడప కార్పొరేషన్‌: తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ సభ్యులు మాసీమ బాబు కుటుంబ సభ్యులను మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్మోహన్‌రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. రెండు రోజుల క్రితం మాసీమ బాబు సోదరుడు యల్లారెడ్డి సతీమణి సురేఖ మరణించిన నేపథ్యంలో ఆయన వారికి ఫోన్‌ చేశారు. మాసీమ బాబు, యల్లారెడ్డి కుమారుడు రాహుల్‌రెడ్డిలను పరామర్శించి, సురేఖ మరణానికి ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు.

యోగాతో ఆరోగ్యం



బెటాలియన్‌ క్యాంపస్‌లో అధికారుల సైకిల్‌ ర్యాలీ

సిద్దవటం: యోగాతో ఆరోగ్య.. శారీరక దృఢత్వం కలుగుతుందని 11వ ఏపీఎస్పీ బెటాలియన్‌ కామండెంట్‌ కె.ఆనందరెడ్డి అన్నారు. ఆదివారం యోగా అభ్యసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. యోగా విశిష్టత, కాలుష్య నియంత్రణపై ప్రజల్లో అవగాహన కలిగించడానికి సైకిల్‌ ర్యాలీ తీశామన్నారు. సైకిల్‌ వాడకం ద్వారా శరీరానికి దృఢత్వం, ఫిట్నెస్‌ పొందవచ్చన్నారు. ఆరోగ్యకరమైమన, కాలుష్య రహిత జీవన విధానానికి ప్రోత్సాహం ఇవ్వడం జరుగుతుందన్నారు. సైక్లింగ్‌, యోగా అభ్యాసనాల ద్వారా ఆరోగ్యాన్ని సమర్థవంతంగా ఉత్సాహ భరితమైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంలో ప్రధానపాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌ కమాండెంట్‌ రాజశేఖర్‌, ఆర్‌ఐ, ఆర్‌ఎస్‌ఐలు, ఏఆర్‌ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

చినుకు పడితే.. నరకయాతనే..



రోడ్డులో ఏర్పడిన పెద్ద గుంతలో నిలిచిన వర్షపు నీరు



గుంతలమయంగా మారిని వివేకానందనగర్‌ 20 ఏ2 రోడ్డు

వివేకానందనరగ్‌లో అధ్వానంగా రహదారులు

కడప ఎడ్యుకేషన్‌ : ఏళ్లు గడచినా ఆ కాలనీలో చినుకు పడితే బురద దారిలో నడవకలేక జనం నరకయాతన పడాల్సిందే. అదే కడప ఆర్టీసీ బస్టాండ్‌కు కూత వేటు దూరంలో ఉన్న వివేకానంద నగర్‌. కాలనీలోని రోడ్డు నెంబర్‌ 20ఏ2 రోడ్డు పరిస్థితి చాలా అధ్వానంగా తయారైంది. రోడ్డు పొడవునా గోతులు ఏర్పడి చిన్నపాటి వర్షానికే నీరు చేరుతోంది. దారిలో నడవాలంటే ఎక్కడ జారి పడతామోనని స్థానికులు భయపడుతున్నారు. దీనికితోడు ఇటీవల ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి రోడ్డుపై మరిన్ని గోతులు ఏర్పడి.. బురదమయంగా మారింది. గోతులన్నీ చిన్నపాటి కుంటలను తలపిస్తున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

గతేడాది అవస్థలే...

గతేడాది కురిసిన భారీ వర్షాలకు రోడ్లలో మోకాళ్ల లోతు వర్షపు నీరు చేరి చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామని స్థానికులు తెలిపారు. అధిక వర్షం కారణంగా అప్పట్లో రెండు రోజులపాటు ఇళ్ల నుంచి బయటకు రాలేకపోయామని చెప్పారు. రహదారి మరమ్మతు చేయించాలని పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లామని, పట్టించుకునే నాథుడే కరవయ్యారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేకు సమస్య విన్నవించినా స్పందించ లేదని స్థానికులు తెలిపారు.

వర్షం వస్తే నడవలేకపోతున్నాం



చిన్నపాటి వర్షం వచ్చినా నీరంతా రోడ్డులోని గుంతల్లో నిలుస్తోంది. చిన్నపిల్లల నుంచి పెద్దవారి వరకు నడచి వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. కార్పొరేషన్‌ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అధికారులు స్పందించి సీసీ రోడ్డు నిర్మించాలి.

– జ్యోతి, గృహిణి, వివేకానందనగర్‌, కడప

గతేడాది ఇళ్లలోకి...



గతేడాది కురిసిన పెద్ద వర్షాలకు రోడ్డులో మోకాళ్ల లోతు నీరు నిలిచింది. దీంతో చాలా ఇబ్బందులను ఎదుర్కొన్నాం. ఈ ఏడాది అంత పెద్ద వర్షం కురవలేదు కాబట్టి అంతగా నీరునిలవలేదు. పెద్ద వర్షం వస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే.

– చంద్రిక, గృహిణి, వివేకానందనగర్‌, కడప

పెద్ద దర్గాలో భక్తుల సందడి



వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడుతున్న దర్గా



విద్యుద్దీపకాంతులతో దర్గా



ఫాతేహా చదివిస్తున్న అంజద్‌బాషా, తదితరులు

కడప పెద్ద దర్గాలో ఆదివారం గంధోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉరుసు ఉత్సవాల్లో పాల్గొనేందుకు జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్‌, కడప

అలరించిన నృత్యం



నృత్యం చేస్తున్న చిన్నారులు

కడప సెవెన్‌రోడ్స్‌: ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా కడప శివారులోని శిల్పారామం సాంస్కృతిక కళా వేదికపై చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. మిస్పా మూవీ సహకారంతో కడపకు ఏఎం.డ్యాన్స్‌ అకాడమీ బృందం పల్లె జానపదాలు, గణపతి పప్పా మోరియా అంటూ ప్రదర్శించిన నృత్యం వన్స్‌మోర్‌ అనిపించాయి. శిల్పారామం పాలనాధికారి కృష్ణ ప్రసాద్‌, ఫీల్డ్‌ సూపర్‌వైజర్‌ మధుసూదన్‌ బాబు పర్యవేక్షించారు.

చేతి వృత్తుల ప్రదర్శనకు అవకాశం

శిల్పారామంలో చేతి వృత్తిదారులు తయారుచేసిన కళాఖండాల విక్రయానికి తక్కువ ధరలకే స్టాల్స్‌ ఇవ్వాలని, కొత్త గేమ్స్‌ ప్రవేశ పెట్టాలని శిల్పారామాల అధికారి స్వామినాయుడు, చైర్‌ పర్సన్‌ మంజులారెడ్డి ఆదేశించారని కృష్ణప్రసాద్‌ తెలిపారు.

పరామర్శ



జయచంద్రారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్‌: అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి.జయచంద్రారెడ్డిని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పరామర్శించారు. బాలాజీపేటలోని జయచంద్రారెడ్డి స్వగృహానికి వెళ్లి ఆదివారం సాయంత్రం ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో దాసరి శివప్రసాద్‌, షఫీ, రమేష్‌రెడ్డి, శంకరాపురం సింధు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తి అరెస్టు

కడప అర్బన్‌: కడప రవీంద్ర నగర్‌లో నివాసముంటున్న గణేష్‌ అనే వ్యక్తితో సహ జీవనం చేస్తున్న ఈశ్వరమ్మ ఇటీవల అతడికి దూరంగా ఉంటోంది. తనతోపాటు నిదిరంచాలని ఈశ్వరమ్మ కుమారుడు చంద్రకాంత్‌(17)ను ఈ నెల 22న గణేష్‌ తన ఇంటికి తీసుకుని వచ్చాడు. చంద్రకాంత్‌ నిద్రిస్తున్న సమయంలో గణేష్‌ రంపంతో అతడిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ సంఘటనలో నిందితుడైన గణేష్‌ను కడప తాలూకా సీఐ రెడ్డెప్ప ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం అరెస్ట్‌ చేసి మెజిస్ట్రేట్‌ ముందు హాజరుపరిచారు.

డీఎస్సీ మహాధర్నాకు తరలిన ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్‌: డీఎస్సీ ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు విజయవాడలోని ధర్నా చౌక్‌ వద్ద జరిగే మహా ధర్నాకు ఉమ్మడి వైఎస్సార్‌ జిల్లా నుంచి అభ్యర్థులు తరలివెళ్లారు. ఆదివారం సాయంత్రం కడప ఎన్‌జీవో భవన్‌ నుంచి 2003 డీఎస్సీ రాష్ట్ర ఫోరం జిల్లా కన్వీనర్లు గుజ్జల తిరుపాల్‌, కావేటి ఉదయ్‌బాస్కర్‌ ఆధ్వర్యంలో వంద మందికిపైగా అభ్యర్థులు బస్సు, ట్రైన్‌, సొంత వాహనాల్లో వెళ్లారు. ఈ కార్యక్రమాన్ని ఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, యూటీఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ రాజా, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మోపూరు శివారెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా, డీఎస్సీ ఫోరం కన్వీనర్లు కురకూటి సుధాకర్‌, మిద్దె ప్రవీణ్‌ కిరణ్‌, బండి నాగేశ్వరెడ్డి, కందకూరు వీరప్రతాప్‌, బసిరెడ్డి శోభారాణి, కటబత్తుల సునీత జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. గుజ్జల తిరుపాల్‌, కావేటి ఉదయ్‌బాస్కర్‌లు మాట్లాడుతూ మొదటి నుంచి ఉద్యమానికి జిల్లా, రాష్ట్రస్థాయి నుంచి అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మద్దతుగా నిలిచాయనన్నారు.



వాహనాలను ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

ట్రిపుల్‌ ఐటీ విద్యార్థి ఆత్మహత్యపై విచారించాలి

కడప ఎడ్యుకేషన్‌: వేంపల్లి మండలం ఇడుపుల పాయ ట్రిపుల్‌ ఐటీలో జరిగిన ఇంటర్‌ విద్యార్థి బలవన్మరణానికి కారణాలపై న్యాయవిచారణ జరిపించాలని ఆర్‌ఎస్‌యూ కడప నగర అధ్యక్షుడు గురు మోహన్‌ డిమాండ్‌ చేశారు. కడప ఆర్‌ఎస్‌యూ కార్యాలయంలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ నెల కిందట భోజనంలో పురుగులు రావడంపై విద్యార్థులు అక్కడ ధర్నా నిర్వహించడం జరిగిందన్నారు. సమస్య పరిష్కరించకపోగా కళాశాల సిబ్బంది నిర్లక్ష్యంతో నరసింహానాయుడు బలవన్మరణానికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం చేసి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని తెలిపారు. లేదంటే రాబోయే రోజుల్లో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొండయ్య, రాఘవ, ముజబత్‌బాషా, జశ్వంత్‌, కిరణ్‌, సందీప్‌, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌యూ నాయకులు

• ప్రమాదంతో చెలగాటం





కొందరు ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదంతో చెలగాటమాడుతున్నారు. పెట్రోల్‌ లేకనో, మరమ్మతులకు గురయ్యో వాహనం ఆగిపోతే మరో వాహన దారుడు కాలితో నెట్టుతూ ఫీట్లు చేస్తున్నారు. ఇలా చేస్తున్న క్రమంలో బ్యాలెన్స్‌ తప్పితే ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదు. మరికొందరు ద్విచక్ర వాహనంలో వెళ్లూ సైకిల్‌ పట్టుకొని వెళ్తున్నారు. సైకిల్‌ అదుపు తప్పితే ప్రమాదం జరిగే అవకాశాలున్నాయి. కడప–రిమ్స్‌ మార్గంలో ఈ దృశ్యాలు కనిపించాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్‌, కడప

దూదేకుల వర్గీయులకు దక్కని ఫలాలు

కడప రూరల్‌: దూదేకుల వర్గీయులకు ఎంపీ, ఎమ్మెల్సీ సీట్ల కేటాయింపులో అన్యాయం జరిగిందని ఏపీ నూర్‌ బాషా ముస్లిం దూదేకుల పొలిటికల్‌ జేఏసీ రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ సుంకేసుల బాదుల్లా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దన్న అన్నారు. స్థానిక వైయస్సార్‌ మెమోరియల్‌ ప్రెస్‌ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ స్వాతంత్రం లభించినప్పటినుంచి నేటి వరకూ దూదేకుల వర్గీయులకు రాజ్యాంగ ఫలాలు దక్కలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల మంది దూదేకుల సోదరులున్నా, ఒక ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ కానీ లేకపోవడం బాధాకరమన్నారు. 2024 లో నారా లోకేష్‌ అనేక హామీలిచ్చి మాట తప్పారని ఆరోపించారు. అనంతరం జిల్లా దూదేకుల పొలిటికల్‌ జేఏసీ కార్యర్గాన్ని ఏర్పాటుచేశారు. జిల్లా అధ్యక్షుడిగా నాగూరు కుళ్లాయప్ప, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌గా సరిటాల పక్రుద్దీన్‌, యూత్‌ అధ్యక్షుడిగా బాబాహుస్సేన్‌, ప్రధాన కార్యదర్శిగా చింతకుంటబాబు, ఉపాధ్యక్షుడిగా అబ్దుల్‌, మస్తాన్‌, సిద్దయ్య, బెల్లంకొండ దస్తగిరి, కుళ్లాయప్ప, కార్యదర్శులుగా దుర్గం సుభాన్‌ అలీ, బాషా, రాయపాటి దస్తగిరిలను ఎన్నుకున్నారు.



పత్రాలు అందజేస్తున్న బాదుల్లా, పెద్దన్న

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కడప ఎడ్యుకేషన్‌: కడప నగరంలోని స్వాతి హైస్కూల్‌ పాఠశాల 1995–96 బ్యాచ్‌ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కడప బైపాస్‌ రోడ్డులోని త్రినయనం ఫంక్షన్‌ హాల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దాదాపు 30 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ ఆలింగనాలతో, చిరునవ్వుల పలుకరింపులతో సందడిగా సాగింది. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యాయులు వీరా రెడ్డి, మురళి, వెంకటసుబ్బయ్య, ఉత్తమ కుమార్‌ రెడ్డి మాట్లాడుతూ ఎల్లప్పుడూ విద్యార్థుల ఉన్నతిని కోరుకునే ఉపాధ్యాయుల పట్ల విద్యార్థులు చూపే ప్రేమ, గౌరవం మరిచిపోలేనివన్నారు. అనంతరం ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రుషి, నరసింహారెడ్డి, రమేష్‌, రమణ, హరికృష్ణ పాల్గొన్నారు.



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

దివ్యాంగులపై ప్రభుత్వానికి కనికరం లేదు

కడప కార్పొరేషన్‌: దివ్యాంగుల పట్ల కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం కనికరం లేదని, మనసు, మానవత్వం లేకుండా కర్కశంగా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్‌.శివరామ్‌ పేర్కొన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి సర్కార్‌ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కొత్త పింఛన్‌ మంజూరు చేయకపో షరతులు పెట్టి దివ్యాంగ పింఛన్‌ దారులను ఆస్పత్రుల చుట్టూ తిప్పుతూ వచ్చారన్నారు. ఇప్పుడు లక్ష మంది దివ్యాంగుల పింఛన్లు రద్దు చేసి రోడ్లపాలు చేశారని ధ్వజమెత్తారు. ఈనెల 25వ తేది కలెక్టరేట్‌ ఎదుట వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. కె.శివ యాదవ్‌, వెంకట సుబ్బయ్య, సురేంద్ర, శివ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్‌.శివరామ్‌

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్‌: ఆధ్యాత్మిక చింతన అందరూ అలవర్చుకోవాలని ఒంటిమిట్ట ఎంఈఓ డాక్టర్‌ వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. కొత్తపల్లె రామాంజనేయులు రచించిన ‘ఉదయ సింధూరం’ పుస్తకావిష్కరణ సభ స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీ రామాలయంలో ఆదివారం జరిగింది. బ్రహ్మయ్య మాట్లాడుతూ ఒంటిమిట్ట చెరువు, బౌద్ధారామాల అంశాలు పుస్తకంలో ఉన్నాయన్నారు. లయన్‌ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ చరిత్ర, సంస్కృతి వంటి విషయాలు పుస్తకంలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో శారద ప్రసన్న, ఎన్‌.ఈశ్వర్‌రెడ్డి, మోరంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, మూల మల్లికార్జునరెడ్డి, దేసు వెంకటరెడ్డి, కొండూరు జనార్దన్‌రాజు, డాక్టర్‌ జీవీ.సాయిప్రసాద్‌, డాక్టర్‌ వెల్లాల వెంకటేశ్వరాచారి, జానమద్ది విజయభాస్కర్‌ పాల్గొని మాట్లాడారు. అనంతరం రచయిత కొత్తపల్లె రామాంజనేయులును పలువురు ఘనంగా సత్కరించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

పేద బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించాలి

కడప సెవెన్‌రోడ్స్‌: పేద బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా ప్రతినిధులు కృషిచేయాలని బ్రాహ్మణ చైతన్య వేదిక నాయకులు కోరారు. నగరంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయం ఆవరణలో ఆదివారం బ్రాహ్మణ సమ్మేళనం జరిపారు. చైతన్య వేదిక రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు రఘునాథరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ తమ కుటుంబాల్లో పలువురికి తల్లికి వందనం పథకం కింద ఆర్థిక సాయం అందలేదన్నారు. ఇంటి స్థలాలు, సొంత ఇల్లు లేక ఇబ్బందిపడుతున్నట్లు తెలిపారు. బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్‌ క్రెడిట్‌ సొసైటీలకు గవర్నింగ్‌ బాడీ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ నామినేటెడ్‌ పదవుల్లో అవకాశం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్‌, ప్రసాద్‌, పిడతల గోపాలకృష్ణ, చంద్రమౌళి శర్మ, చిత్రపు హనుమంతరావు, తిరుపతి అనంతకుమార్‌, సుబ్బారావు, నరేష్‌ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రసాదరావు

స్వయం ఉపాధి వైపు నడిపించడమే లక్ష్యం

కడప ఎడ్యుకేషన్‌: విద్యార్థినులను స్వయం ఉపాధి వైపు నడిపించడమే లక్ష్యమని రెడ్డి సేవాసమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి తెలిపారు. కడప రాజీవ్‌పార్కురోడ్డులోని రెడ్డి సేవా సమితి భవనంలో ఆదివారం నైపుణ్యాభివృద్ధి కేంద్రం, గ్రంథాలయాలను ఆయ ప్రారంభించారు. లెక్కల కొండారెడ్డి మాట్లాడుతూ ఈ కేంద్రం నిర్వహణకు అరబిందో ఫార్మా ఫౌండేషన్‌ లిమిటెడ్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ కంభం నిత్యానందరెడ్డి, డైరెక్టర్‌ పి శరత్‌చంద్రారెడ్డి ఆర్థిక సహకారం అందించారని తెలిపారు. అనంతరం డాక్టర్‌ కుప్పిరెడ్డి నాగిరెడ్డి, ఆచార్య మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, డాక్టర్‌ ఆవుల సుధాకర రెడ్డి, డాక్టర్‌ రాసుపల్లి వీరసుదర్శన్‌రెడ్డి, మూల మల్లికార్జునరెడ్డి, గుడ్ల ఆదినారాయణరెడ్డి సేవా సమితి చేసే సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను వివరించి చెప్పారు. ఈ కార్యక్రమంలో గుర్రంపాటి వెంకటరెడ్డి, రమేష్‌రెడ్డి, ఆనంద్‌కుమార్‌రెడ్డి, శివన్నారాయణరెడ్డి, నాగేశ్వరరెడ్డి, మాలవ్య, యశస్వి, తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయ శిలాఫలకం ప్రారంభిస్తున్న అతిథులు

ఫ్లాష్‌.. ఫ్లాష్‌..

బైక్‌ను ఢీ కొన్న ఆర్టీసీ బస్సు

ఇద్దరు యువకుల దుర్మరణం

కడప అర్బన్‌: కడప – రాజంపేట రహదారిలో కేంద్ర కారాగారం సమీపంలో కడప నుంచి తిరుపతి వెళుతున్న ఆర్టీసీ ఎలక్ట్రికల్‌ బస్సు, మోటార్‌ సైకిల్‌ను ఢీ కొనడంతో అక్కడికక్కడే ఇద్దరు యువకులు నవీన్‌ (22), చరణ్‌ (20) మృతి చెందారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న కడప ట్రాఫిక్‌ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను కడప రిమ్స్‌ మార్చురీకి తరలించారు. మృతులు కడపలోని శంకరాపురానికి చెందిన వారని పోలీసులు గుర్తించారు.





సంఘటనా స్థలంలో నవీన్‌, చరణ్‌ల మృతదేహాలు



ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు



పూర్తిగా దెబ్బతిన్న ద్విచక్రవాహనం